"వాట్ ఎ వండర్! విన్నావుటే పాపా! అమ్మ పురాణం వినటానికి కన్యకాపరమేశ్వరిఆలయంకి వెళ్ళిందిట."

లెక్చరరు రామారావు ఇంట్లో అడుగు పెడుతూ యథాలాపంగా "అమ్మేదీ?" అంటూ తన భార్యారత్నాన్ని ప్రతి దినంలానే ప్రశ్నించి, వచ్చిన జవాబువిని తుళ్ళిపడి, ఆశ్చర్యపోయి ఎదట ఉన్న భార్యామణిని మరిచి, పక్కగదిలో ఉన్న చెల్లెలికి వినపడేలా బూట్లు విప్పుకుంటూ ఒక్క కేక వేశాడు. అతను ఆశ్చర్యపోవటంలో మాత్రం వింత లేదు. అతని తల్లి మహాలక్ష్మమ్మ ఆయన పుట్టి బుద్ధెరిగిన ఈ ముప్ఫయి ఏళ్ళలోను ఏ నాడూ పురాణానికని అసలు ఎక్కడికన్నా వెళ్ళటమంటేనే అబ్బురం మరి!

"ఈవిడగారు బలవంతంగా ఆ పక్కింటి మామ్మగారితో వెళ్ళి రండని తగిలేస్తే వెళ్ళకేం చేస్తుందీ?"

వంట ఇంట్లో కత్తిపీటముందు కూర్చుని చికాగ్గా కూర తరుగుతూన్న చెల్లెలు పాప వదినగారి మీద తన కోపం అంతా వెళ్ళగక్కుతూ సమాధానం ఇచ్చింది. నిజం చెబితే తల్లి పురాణానికి వెళ్ళిందని కాదా కోపం. వదిన తనని అందులోనూ కాలేజిలో పి. యు. సి. చదువుతూన్న అమ్మాయిని కూర తరిగి పెట్టమన్నదని.

కుటుంబంలో నలుగురి శ్రేయస్సు కోరేవారు బాధ్యత లెరిగి ప్రవర్తించాలి. అవసరమైతే అధికారం చలాయించాలి, శాసించాలి. మంచి పనులే అయినా, అన్ని పనులు మంచిగాను, మంచితోను జరగవు...మంచికోసమై నిష్ఠురాలు, శత్రుత్వం అనుభవించవలసి వచ్చినా, వెనుకాడ నవసరంలేదు.

---

వాళ్ళిద్దరి సంభాషణ విన్న అతని భార్య మణి మాత్రం నిశ్చలంగా నవ్వుతూ అన్నం కలపటానికి హడావిడిగా వంట ఇంట్లోకి వెళ్ళిపోయింది. చిన్నతనం వదలని మరదలి మాటలు పట్టించుకున్నట్లు లేదామె.

మణి ఆ ఇంట్లో అడుగు పెట్టి సుమారు రెండేళ్ళు కావస్తూంది. ఆ ఇంట్లో ఆమె అడుగు పెట్టేనాటికి ఆ ఇంటిలోని వ్యక్తులు ఆరుగురు. భర్త, అతనికన్న చిన్నవారైన ఇద్దరు మరుదులు, ఇద్దరు మరదళ్ళు, అత్తగారు.

భర్త రామారావు ఉదయం పది గంటలకి కాలేజీకి వెళ్ళిపోతే సాయంత్రం ఐదు గంటలకి ఇంటికి తిరిగి వచ్చి, కాస్త కాఫీ, చేస్తే టిఫీను తీసుకుని రీడింగు రూముకి వెళ్ళి ఏవో మేగజైన్సు తిరగేసుకుని, తిరిగి ఎనిమిదిన్నర దాటాక ఇంటికి వచ్చి భోజనం చేసి, కాస్సేపు రేపటి లెక్చరు గురించి పుస్తకాలు చూసుకుని నిద్ర పోవటమనేది ఆయన కార్యక్రమంగా సుమారు ఎనిమిదేండ్ల నుండి వస్తున్నది. ఈ మధ్య రెండేళ్ళయి వచ్చిన ఆదాయం చాలటం లేదంటే పది గంటల లోపుగా ఉదయం పది మంది విద్యార్థులకి ప్రయివేట్లు చెప్తున్నాడు. అలా ఆయన జీవితం నిరాటంకంగా సాగిపోతూంది.

రామారావు పెద్దతమ్ముడు మధు యం. కాం. ఫైనల్ ఇయర్‌కి వచ్చి క్లాసు రావటం కోసం కనిపెట్టుకుని కూర్చున్నాడు. చిన్నతమ్ముడు సారథి మెడిసిన్ మూడవసంవత్సరం ఎనాటమీ — ఫిజియాలజీలతో కుస్తీ పట్లు పడుతున్నాడు. పోతే. . . పెద్దచెల్లెలు శారదను ఆడపిల్లకు చదువెందుకనే ఉద్దేశంతో మహాలక్ష్మమ్మ చదివించ లేదు. అందుకని ప్రతిమనిషి వేషభాషల్ని క్షుణ్ణంగా పరిశీలించి విమర్శిస్తూ రోజులు గడపటం ఆమె దినచర్య. ముద్దులచెల్లెలు పాప అంటే అందరికీ ఒకే అభిప్రాయం. ఆమె చిన్నపిల్ల. ఆమెని అడిగేవారు, చెప్పగలవారు లేనేలేరు.

అట్లాంటి ఆ ఇంటికి యజమానురాలు మహాలక్ష్మమ్మ భర్త ఇచ్చిపోయిన ఆస్తి మంగళహారతి పాడుతూన్న సమయంలో పెద్దవాడు రామారావు చేతికంది రాగా రోజులు గడుపుకు వస్తూందామె. తెచ్చిన జీతాన్ని ప్రయివేట్ల డబ్బుతో సహా తల్లిచేతిలో పెట్టి తనకి కావలిసిన చిల్లర కూడా తల్లి నడిగి అవసరాలు గడుపుకొనే వ్యక్తి రామారావు.

## కె. రాణి

ఒకరికి తెలియకుండా ఒకరు తల్లి దగ్గిరనుండి ఏదోలా డబ్బు గుంజి పట్టుకుపోయే వ్యక్తులు అతని తమ్ముళ్ళు. ఒకరి మీద ఒకరు పోటీపడి, ఖర్చుచేసే వాళ్ళు చెల్లెళ్ళు.

ఇట్లాంటి సంసారంలో కన్నెహృదయపు తీయని కలలతో, మాత్న భావాల నునుసిగ్గుతో, నూతన వధువుగా అడుగు పెట్టిన మణికి మొట్టమొదటి నచ్చని పని ప్రతి ఖర్చుకీ తన భర్త తల్లి నడిగి డబ్బు పుచ్చుకోవటం, లెక్కలు, కారణాలు వివరిస్తేగాని డబ్బు ఇవ్వని అత్తగారి ప్రవర్తన. పోతే. . . తను పువ్వులు కొనుక్కోవటానికన్నా అత్తగారి ఇష్టమేనని అర్థమయ్యే సరికి ప్రాణం పోయినట్లయింది. 'పోనీ అత్తగారే నెల ఖర్చులకని ఆయనకి కొంత డబ్బివ్వకూడదూ? ప్రతిదానికి అడగటం ఏం బాగుంటుంది?' అనుకుందామె. పైగా మరుదులు చాటుమాటుగా ఆడబిడ్డలు పోటీలు పడి డబ్బు తీసుకోవటం ఆమెకి వ్యథ కలిగించింది. కొత్తలో ఊరుకున్నా రాను రాను ఆమెకి మరీ దుర్భరమనిపించసాగింది ఇంటి వాతావరణం.

ఆషాఢమాసమయి శ్రావణంలో పుట్టింటి నుండి వచ్చిన ఆమె వరలక్ష్మివ్రతానికి తన చీరతో సంతుగా ఆడబిడ్డలు కొనుక్కోవటం, అన్నింటికీ తనకన్న హెచ్చుగా తమకి కావాలనే పట్టుదల పంతాలతో ప్రవర్తించటం ఆమెకేమీ నచ్చలేదు


ఉబ్బసపు దమ్ములనుండి తక్షణ ఉపశమనానికి

అగస్మాత్తుగా ఉబ్బసపు దమ్ము రాగడలదనే వెంటాడే భయంతో బాధపడుతూవుంటే బ్రోవోన్ అందుబాటులో వుంచుకోవాలని గుర్తుంచుకోండి.

బ్రోవోన్ వాడటంవల్ల త్వరితమైన ఉపశమనం చేకూరి చక్కని నిద్రపడుతుంది. ఉబ్బస రోగులు తమ దినచర్యను యథేచ్ఛగా నడపించగల్గుతారు. మామూలు జీవితం సాగించగల్గుతారు.

బ్రోవోన్ గురించిన ఉచితంగా యివ్వబడే చిన్న పుస్తకానికై అడగండి






బ్రోవోన్
ఆస్త్మ ఇన్‌హెలెంట్

బిడిల్ సాయర్ అండ్ కో. (ఇండియా) ప్రైవేట్ లి.,
పి. బి. 1992, బొంబాయి; పి. బి. 5046, మద్రాస్; పి. బి. 887, కలకత్తా.

VAPI:BS:7/68-TE

మరీ ఇంత దారుణంగా ప్రవర్తించటమా అనుకుంది భర్తను శరణు వేడింది. ఈ సుడిగుండంలో నించి మణి. దానికి తోడు పెద్దమరిది ఈసారికూడా బయటపడే మార్గం వెతకమన్నది. నిస్సహాయంగా పరీక్షకి వెళ్లలేదనీ, చిన్నమరిది పాసవలేదనీ విన్న నే నేం చేయలేనన్న ఆ మాతృవిధేయుని ప్రవర్తన ఆమెకి తల తిరిగినంత పని అయింది. ఏం చేయటం? ఆమెలో తీవ్ర చలనానికి దారి తీసింది. ఏదో




చేయాలి? ఏమిటిది? ఎన్నాళ్లిలా జరుగుతుంది? భవిష్యత్తులో తన కలలు, తన ఆశయాలు ఫలించే సూచన లీ పరిస్థితుల్లో ఏమున్నాయి? ప్రతిక్షణం తన వ్యక్తిత్వానికి ఎదురుదెబ్బ కొట్టే ఆర్థికసమస్య, ప్రతి పనికీ తనని నిలదీసే వ్యక్తులు, ఏది చేయాలన్నా కుదరని పరిస్థితులు రాజీ పడలేసి తన తత్వం ఈ సమస్యలను సాధించడమెలా? లేక. . . తన భర్తతో పాటు తనూ గుడ్డిగా పరిస్థితులతో రాజీపడి అనుసరించటమేనా?

ఆమె ఆలోచనలనుండి తేరుకునే లోగానే ఆమె అన్న చిన్నిమాటకి తప్పు పట్టుకుని, అలిగి శారద మాటలు మానివేయటంతో హఠాత్తుగా మణిలో మార్పు వచ్చింది.

మాతృవిధేయుడైన తన భర్త ఆశయానికి లోప మేర్పడకుండా ఈ సమస్యల్ని తను పరిష్కరించి తీరాలి. పెళ్లయి ఏడాది దాటినా ఏ మాత్రం మార్పు కనపడటం లేదు. అంతే. . . దృఢంగా విశ్వయించు కున్నది. తాత్కాలికపు ఒడిదుడుకులకు చలించకుండా తన విద్యని, విజ్ఞానాన్ని వెచ్చించి ఈ ఇంటి వాతావరణాన్ని మార్చాలి. ఎలా? తన భర్తను తల్లి వద్దనుండి వేరు చేయకుండా, ఆయన ఆత్మీయుల

కేటువంటి నష్టం సంభవించకుండా తను తన కార్యక్రమాన్ని ఏర్పరుచుకోవాలి. ఆలోచించి తుదకొక ప్రణాళిక ఏర్పరుచుకున్నది మణి.

అంతవరకు ఏ సంబంధం కుదరక, కుదిరినా శారదకి నచ్చక వాయిదా వేస్తూ వచ్చిన శారదపెళ్లిని మూడు నెలల్లో తనకి అన్నవరస అయ్యే ఒక గ్రాడ్యుయేటుకు మూడువేల కట్నం ఇచ్చి పెళ్లి చేసుకుందుకు కుదిర్చి పెట్టింది మణి. రామారావు మహాలక్ష్మమ్మకూడా అబ్బాయిని చూసి తృప్తి పడ్డారు.

అత్తవారింటికి వెళ్లిపోతూ అక్కసుగా "నన్ను ఇంట్లోంచి పంపేయాలనేగా ఇంత త్వరగా పెళ్లి చేసేసేవు. హు. . . ఇక నీవు బ్రతిమాలినా ఈ ఇంటికి రానులే. నా బాధ నీకు వదిలిందని సంతోషించు" అంటూన్న శారదవైపు చూసి నిండుగా నవ్వింది మణి.

"ఒక సంవత్సరం వరకు నా బాధ నీ కుండదులే. ఆ తరవాత మళ్లీ నీ కోసం కాకపోయినా మేనల్లుడి కోసమన్నా నిన్ను తీసుకు వస్తాను" అంటూన్న మణివైపు కోపంగా చూస్తూ బండి ఎక్కింది శారద. మణి మాత్రం తృప్తిగా నవ్వుకుంది.

కొద్ది రోజుల్లోనే పరీక్ష ఫీజు కట్టమని ఇచ్చిన డబ్బుతో బట్టలు కుట్టించుకు వచ్చి వేసిన మధుని చూసి సమయం వచ్చిందని గ్రహించుకున్నది మణి. ఇక ఈ ఇంటి ఆర్థికసమస్యని కూడా తను సాధించక తప్పదు.

అందరు కూర్చున్న సమయంలో మధుతో మృదువుగా చెప్పింది.

"మధూ! అసలే రోజురోజుకి ధరలు మండి పోతున్నాయి. మీ అన్నయ్య సంపాదిస్తున్నది చాలటం లేదు. నీవు త్వరగా ఏదన్నా ఉద్యోగం చూసి ప్రవేశిస్తే బాగుండును."

"అవుననుకో వదినా! ఈ ఎం. కాం. లో క్లాసు రావాలని కదా ఈ రెండేళ్లు పరీక్షకి వెళ్ళలేదు. ఈసారి మాత్రం తప్పక వెడదామనుకుంటున్నాను. నా ఉద్యోగానికి అప్పుడే తొందర ఏమి వచ్చింది?"

ఏదో లక్ష్యం లేనట్లు జవాబిచ్చి తప్పించుకోబోతూన్న మధుని, దాన్ని సమర్థించబోతూన్న అత్తగారిని, అప్పటికే అమ్మ ఏమనుకుంటుందోనన్న భయంతో ఉన్న భర్తని చూసింది మణి. తన నిశ్చయాన్ని మాత్రం మార్చుకోలేదామె. బాధ్యత తెలిస్తేనే తప్ప ఈయన పరీక్ష వ్రాసేవాలనుకోడు. క్లాసు కోసం చూస్తూ కూర్చుంటాడు. శారదపెళ్లి ఆడపిల్ల కనక చాలా సామాన్యంగా తన కార్యసాఫల్యాని కనుగుణంగా జరిగిపోయింది. ఈ విషయంలో మాత్రం మాట పడక తప్పదు.

"అవన్నీ నాకు తెలియవు మధూ! నీ కీక పరీక్షఫీజులకి, వాటికి డబ్బిచ్చే స్తోమత మాకు లేదు. అందుకుండి త్వరగా ఉద్యోగం చూసుకుని, తరవాత క్లాసుని గురించి ఆలోచించటం మంచిది. మీ అన్నయ్య డబ్బివ్వదలుచుకున్నా, నే నందుకు ఒప్పుకోను. నాకూ అవసరాలు పెరుగుతున్నాయి. ఇకపైని ఇలా జరగటం నేను సహించలేను."

"హు. . . మీ అడబుద్ధి పోనిచ్చుకున్నారు కాదు." విసురుగా లేచి వెళ్ళబోతూన్న మధు, కోపంతో చిందులు తొక్కబోతూన్న అత్తగారు, అప్పటికే లెక్చర్లవల్ల కొంత ఆలోచించ నేర్చుకున్న రామారావు నిరుత్తరులయ్యేలా ఒక్క మాటలో సమాధానం ఇచ్చింది మణి.

"ఆఁ. . . అది నా ఆడబుద్ధే. ఒప్పేసుకున్నాను. కాని. . . ఒక్క నెల రోజుల్లో నీవు ఉద్యోగప్రయత్నం చేసి చేరిపోవటం మంచిది. ప్రతిసారీ నీ వనటం నే పడటం నే నంటే నీవు పడటం బాగుండదు. ఇప్పటికే నీవు క్లాసు కోసం నిరీక్షిస్తూ రెండేండ్లయింది. అది వచ్చేమార్గం కనపడటం లేదు. కనక. . ."

"నన్ను భరించటం కష్టంగా ఉంటే తప్పక అలానే చేస్తాను." మధ్యలోనే సమాధానమిచ్చి కోపంగా అక్కడినుండి నిష్క్రమిస్తూన్న మధువైపు నిశ్చలంగా చూసింది. అతనిలోని ఏదో నిశ్చయం వ్యక్తమయి తృప్తిగా గాలి పీల్చుకుంది. బాధ్యతల బరువులో మధు త్వరలోనే పరీక్ష వ్రాసేస్తాడనుకుందామె. కాని. . . తనవైపు తీక్ష్ణంగా చూస్తూన్న భర్తవైపు



ప్రసాధనం

—జి. ప్రభాకర్ (హైదరాబాదు)

తీయగా చూసి, అత్తగారి వైపు చూసే ధైర్యం లేక అర్థంటుగా వంట ఇంట్లోకి వెళ్లిపోయింది.

అతి త్వరలో మధు ఉద్యోగంలో చేరటం కోసమేకాక ఫస్టుక్లాసు కోసం కలలు కనటంకాక పట్టుదలగా చదవటమూ ప్రారంభించాడు. మధు, శారదల విషయంలో తన ప్రయత్నం ఫలించింది. మరి. . . సారథి. . . పాప. . . వాళ్ల సమస్య తీరే దెలా? పెద్దవాళ్లలా ఖచ్చితంగా చెబితే నిలదొక్కుకోలేని వయస్సు. చిన్నపిల్లల్లా లాలించితే అర్థంకాని వ్యక్తిత్వాలు. వారిద్దరూ మణికి ఎటు పొందని సమస్యలుగా మిగిలారు. ఈ మధ్యలో అత్తగారు ఆమెకో కొత్త అవాంతరం తెచ్చి పెట్టింది.

తన కోడలు తనని, పిల్లల్ని వేరు చేస్తోందని, మొగుడిని వలలో వేసుకొని ఇష్టం వచ్చినట్లు ఆడిస్తోందని ఆమె కేదో అనుమానం వచ్చి ఇంటికి వచ్చిన ప్రతివారితోను ఆ కష్టాలు, భవిష్యత్తులో తను పడబోయే బాధలు వర్ణించి కళ్లనీళ్లు పెట్టుకుని ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆమెని దుయ్యబట్ట సాగింది. పైగా మణి మాట్లాడితే అపార్థాలు, పనిచేస్తే విపరీతార్థాలు తీస్తూ ఇంట్లో ఉండాలంటేనే భయం కలిగేలా చేస్తూ రాసాగింది. పైగా ఆమెకి వంతగా పాపకూడా మణిని నిరసనగా చూడసాగింది.

మణి ఈ అవాంతరాన్ని ఎదుర్కోవటానికి మొదట్లో విపరీతంగా మానసికవు ఆవేదనకి లోనవవలసి వచ్చింది. ధైర్యం వహించి ఆలోచించి ఒక నిశ్చయానికి వచ్చింది. కొంత వయస్సు మీరాక ప్రతి వ్యక్తి తన బాధ్యతల్ని వీలైనంతవరకు వదులుకొని ఏదో వినోదంగా, ఆహ్లాదంగా జీవితాన్ని గడుపుకుంటూ పోకపోతే వారికి భయాందోళనలు, అర్థంలేని ఆవేశాలు తలచూపుతా యని తలచి మణి ప్రత్యేకంగా పని కట్టుకుని రెండు రోజులు సాయంత్రం పక్కఇంటిలోని బామ్మగారి దగ్గిరికి వెళ్లి ఆవిడతో పురాణం వినిపచ్చి అత్తగారి వినకపోయినా అదంతా వర్ణించసాగింది.

అది అలవాటుగా చేసుకుని "మీ కోడలింకా పురాణానికి వెళ్ళటానికేం రాలేదూ!" అంటూ ఇంట్లోకి వచ్చిన బామ్మగారు "నీవుకూడా రాకూడదుటే మహాలక్ష్మమ్మా! పుణ్యం పురుషార్థం" అంటూ ప్రారంభించింది. ఆ అవకాశం కోసమే చూస్తూన్న మణి, వెళ్లమని అత్తగారిని బలవంతంగా పంపటమే గాక "మా అత్తగారు ఒక్కరూ వెళ్లలేరు. మీరు మా ఇంటికి వచ్చేరంటే రోజూ వస్తారు" అంటూ గ్లాసెడు మజ్జిగతోపాటు ఆ బాధ్యతకూడా ఆమెకు అంట గట్టింది. ఆ ప్రయత్నం ఫలించి మహాలక్ష్మమ్మ ఇరువదినాలుగు గంటలు తన కష్టాలకి వాపోవటం మాని కొంతవరకు ఆ ధ్యాసలో పడింది. మొదట్లో దానివల్ల కొంతవరకు అరటిపళ్లకి, పురాణదానధర్మ దానాలకి ఖర్చు పెరిగినా క్రమంగా సర్దుకు పోయింది.

ఈ అవకాశం తీసుకొని సాయంత్రం కాలేజినుండి వస్తూనే షోకుగా తయారయి స్నేహితురాళ్లతో తిరగటానికి పోయి వచ్చి, అన్నం దగ్గిర గొడవ చేస్తూ నిర్లక్ష్యంగా తిరిగే పాపని మొదట్లో బలవంతంగా పని చేయటానికని ఉంచేసి అటు తరవాత అలవాటుగా మార్చి నెమ్మదిగా మంచి మాటలతో, కబుర్లతో భవిష్యత్తుమీది ఆశలతో పరిస్థితులు, కర్తవ్యం గుర్తింపజేసి అప్పటికి వంతులు వేడటం ప్రతివారితో సినిమాలకి, షికార్లకి బయలుదేరటం ఎదటి వ్యక్తిని గురించి అసహ్యంగా మాట్లాడటం వంటివి చేయకుండా అసలైన విద్యార్థినిగా పాపని తీర్చి దిద్దిన మణి తనని చూసి తనే గర్వపడింది.

"ఈ రోజు నీవు, వదిన పిక్చరుకి వెళ్లి వచ్చేయండి అన్నాయి! నాకు రేపు క్లాసు టెస్టులున్నాయి." అంటూ నవ్వుతూ టాటా చెప్పిన పాపమీద ఆమెకి అవ్యక్తమయిన ప్రేమ పొంగుకు వచ్చింది. వదిన, వదినంటూ వెనక తిరిగే పాపని చూస్తే మణికదో తృప్తి.

అత్తగారుకూడా కొంత మార్పు చెంది, తను, తన తోటిభక్తులు, పురాణాలు, హరికథల్లోపడి "చూడవే కోడలా! వాడేదో డబ్బుని గురించి చెబుతున్నాడు. అది చూస్తావూ! నా కవతల పురాణానికి వేళవుతోంది. ఈపాటికే ప్రారంభించేశారేమో!" అనటం వరకు వచ్చింది. ఆ అవకాశం తీసుకుని

ఖర్చులు, వెచ్చాలు తను తీసుకుని అరువుల కూరలవాళ్ళు వేసే ధరలు, పాలవాడు పోసే నీళ్ళు వీటి లెక్కలన్నీ సర్దుకోసాగింది. కాని. . . ఇన్ని జరుగుతూన్నా ఆమె కొక సమస్య మిగిలిపోతూ వచ్చింది. ఎంత చదివినా తరగని వైద్యశాస్త్రం చదువుతూన్న సారథి చదువుమాట వదిలి స్నేహితులు, సినిమాలు, క్రికెటు కామెంటరీలు వీటిలో పడి రోజు రోజుకి చదువుకు దూరమవటం ఆమెకి తోచకుండా చెయ్యసాగింది. ఎలాగు ఇతనిని అదుపులోనికి తేవటం? ఇప్పటికి ఈ మూడవ సంవత్సరం దాటని సారథితో ఎలాగో అర్థం కాకుండా పోయింది. ఆమెకీ సమస్యకి పరిష్కారమే కనపడలేదు.

ఉదయం లేస్తూనే కాఫీ తాగి, స్నానంచేసి కాలేజికి వెళ్ళిపోతే అతను తిరిగి వచ్చేది సాయంత్రం నాలుగు దాటాక. వస్తూనే టిఫిను, కాఫీ కానిచ్చి ఫ్రెండ్సు దగ్గిరికి తిరగటానికి వెడితే వచ్చేది పది గంటలకి. అదృష్టం బాగుంటే అర్ధగంట ముందు. చదువును గురించి అడిగితే మధ్యాహ్నం లైబ్రరీలో చదివానన్న జవాబు. మణి కెటూ తోచలేదు. భర్తచేత గట్టిగా చెప్పిద్దామని ప్రయత్నించింది. రామారావు నోరు విప్పి ఏదో చెప్పబోయేలోగానే "వాడికి మాత్రం చదువుకోవాలని తెలియదేమిటిరా! అదృష్టం కలిసిరాకగాని!" అన్న జవాబు తల్లి దగ్గిరనుండి రాగానే అతను నిశ్శబ్దం వహించేవాడు. మణికదొక కొరుకుడు పడని సమస్య అయింది. మధుని ఒక్క మాట అనేసరికి కార్యం ఫలించింది. శారదకి పెళ్ళి చేసేసరికి బాధ్యతలు తెలిసివచ్చాయి. అత్తగార్ని, పాపని తను సహనంతో సాధించ గలిగింది. మరి. . . ఇతనెలా? సారథి నలా వదిలేయవలసిందేనా? పైగా అతను ఇంటిలో ఉండే సమయం తక్కువ. మణితో మాట్లాడేది మరీ తక్కువ. మాట్లాడేదన్నా తేలికగా సినిమాకబుర్లు, కాలేజివిశేషాలు తప్పించి మరేమీ ఉండవు.

ఫీజు కట్టాలన్నా, జేబు ఖర్చుకి కావాలన్నా తల్లి దగ్గిరనుండి అతనికి ముట్టిపోతాయి. అన్నని అడగవలసిన అవసరం అతనికి కలగదు. అట్లాంటి అతని నెలా మార్చటం? పైగా కాబోయే డాక్టరయిన తను డబ్బుకు ముఖం చూసుకుంటూంటే నలుగురూ నవ్వుతారని, పైగా రేపు డాక్టరునయితే రోగుల మధ్య ఒక్క క్షణమన్నా తీరికుండదు. కనక ఈనాడే జల్సాగా, కుషీగా జీవితాన్ని గడిపేయాలని ఏవేవో బాధ్యతలేని ఊహలమధ్య ఊగే అతనిని మార్చటమెలా? అలాగని ఊరుకోగలదా? మణి వివిధాలైన ఆలోచనల మధ్య ఊగసాగింది.

మధ్యతరగతి వ్యక్తులిట్లాంటి చదువుల్లో ప్రవేశించి పైగా బాధ్యత లేకుండా ప్రవేశించటమా అన్న ఏదో క్రోధం సారథిపై పెరగసాగింది. దాన్ని వదుల్చుకోలేక కర్తవ్యం స్ఫురించక త్రొక్కిసలాడుతూన్న మణికి నడిసముద్రంలోని కర్రబల్లలా చిన్న ఆధారం దొరికింది. హడావిడిగా పురాణానికి వెడుతూ సారథికి సినిమాకి డబ్బు ఇమ్మని మహాలక్ష్మమ్మ చెప్పి వెళ్ళిపోయింది. ఆ రోజుకి మౌనంగా డబ్బిచ్చి అతను వెళ్ళాక చాలసేపు తీవ్రంగా ఆలోచించిన ఆమెకి ఏదో చిన్న ఆశ పొడగట్టింది. దానిని ఎగదోస్తూ శారద తన కిప్పుడు ఆరో నెల, తల్లిని పంపమని మణిపేర రాస్తూ, పూర్వపు తన ప్రవర్తనకి క్షమాపణ వేడుకుంటూన్న జాబు వచ్చింది. తన భర్త ఒక్కరు ఉండలేరు కనక తను తొమ్మిదో నెల వచ్చేక పురుటికి తల్లితో కలిసి వస్తుందిట. ఆ జాబు చూసిన మణి నవ్వుకుంది. తనని తగిలెయ్యటానికి పెళ్ళి చేశారన్న శారద ఈనాడు పుట్టింటికి భర్తను వదిలి రావాలని భయపడుతూంది. బాధ్యతలతో బంధితులైన ఈ స్త్రీల జీవితాలింతేనేమో!

హడావిడిగా అత్తగారు కూతురి దగ్గిరకి బయలుదేరి వెళ్ళిపోతూ ఇంటిని, పిల్లల్ని పోయిగా, నిశ్చింతగా తన కప్పగించి వెళ్తూన్న వ్యక్తిని చూసి నవ్వుకుంది మణి, ఒకనాడీమె తను పిల్లల నుండి వేరు చేస్తూందని బాధపడ్డ వ్యక్తేనా అనుకుంటూ. కాని. . . మరొక్క బాధ్యత తనకి మిగిలి ఉంది. దానిని ఈ అవకాశం తీసుకు సాధించగలిగితే తృప్తి పడవచ్చు. లేకపోతే. . . మణి భారంగా ఊపిరి పీల్చుకుంది. ఫలితం ఎలా ఉన్నా ప్రయత్నం చెయ్యక తప్పదుగా!

సారథి ఎందుకో అర్జంటుగా అయిదు పదులు కావాలన్నాడు. ఆ అవకాశం తను ఉపయోగించుకోవాలను కుంది. రామారావు ఇంటి దగ్గిర లేడు. పాప కాలేజినుండి ఇంకా రాలేదు. మణికి లోప బాధగానే ఉంది. కాని. . .

"ఎందుకోయి?" తేలిగ్గా నవ్వుతూ అడిగింది.

"పనుంది వదినా! అర్జంటుగా ఇవ్వు."

"పని చెప్పకూడదన్నమాట. డబ్బు మాత్రం కావాలి. అయినా కాబోయే డాక్టరుగారు కదూ! చాలా ఖర్చులుంటాయి."

"అందుకేగా అడుగుతూంటా." వినుగ్గా అంటూన్న సారథి వైపు ఒక్క క్షణం తీక్షణంగా చూసింది.

"కాని. . . పరిస్థితులు చూస్తూంటే డాక్టరయ్యే అవకాశాలు తక్కువగా ఉన్నట్టు కనపడుతున్నాయి."

"ఏం? పాసవలేననా?"

"చూస్తూనే ఉన్నాగా!"

"అబ్బబ్బ. . . అమ్మ లేకపోవటం నుండి కదా ఈ గొడవంతా. డబ్బివ్వతలచుకో లేదా? నే తలుచుకుంటే ఈ మెడిసినే ఏమిటి, ఏదన్నా క్షణాలమీద పూర్తి చేసెయ్యగలను."

"కావచ్చు. దానివల్ల నా కేమి ఉపయోగం ఉంది? రేపెప్పుడో నువ్వు డాక్టరు వవుతావు. డబ్బు సంపాదిస్తావు. నాకూ అదే కోరిక. దానివలన నువ్వు, నీ భార్య, పిల్లలు సుఖపడతారు. కాని. . . ఈ నాడు మీ అన్నయ్య తెస్తూన్నదంతా మీకోసం ఖర్చు చేస్తూంటే రేపు ఆయన పిల్లల కేముంటుంది? దానివలన నా కేం లాభం ఉంటుంది? అందునుండి ఆ అయే డాక్టరేదో తమరు త్వరగా అవటం మంచిది. నాతో మళ్ళీ మళ్ళీ చెప్పించుకోవటం బాగుండదు."

"అయినా ఈ డబ్బంతా అన్నయ్యదేం కాదు. ఇందులో కొంత. . ." అసహనంగా అంటూన్న సారథి మాటని మధ్యలోనే అందుకుంది మణి.

"అవన్నీ నాకు తెలియవు. ప్రస్తుతం మీ అన్నయ్య తెస్తున్నారు. నే నిస్తున్నాను. నీకు నిజంగానే చదువు పూర్తి చేసుకోవాలని ఉంటే నేను చెప్పినట్లు చేసి శ్రద్ధగా చదువుకో. వినకపోతే నీ ఇష్టం. ఇదిగో డబ్బేమో ఉంది. నేను చెప్పినట్లు చేసి తీసుకో వచ్చు."

కాస్సేపు దిక్కు తోచనట్లు కూర్చున్న సారథి వైపు చూస్తూ నిలబడింది మణి. ఆలోచించి ఏమనుకున్నాడో ఆమె చెప్పినట్లు చేసి ఆ డబ్బు తీసుకువెళ్ళిపోయా డతను. నిర్లక్ష్యంతో ఏదో తొట్రుపాటు అతని నడకలో చూస్తూ నిశ్చలంగా నిలబడిపోయింది మణి.

తరవాత అతని ప్రవర్తనలో మణి ఆశించిన మార్పు వచ్చింది. అది గ్రహించిన ఆమె తృప్తి పడింది. ఖర్చుకు వెనక తీసి స్నేహితులతో వేసుకున్న అతని వినోదయాత్రని తప్పించబోయిన మహాలక్ష్మమ్మ, రామారావు లని కాదని తన గొలుసును తాకట్టు పెట్టి మరి డబ్బు తెచ్చి ఇచ్చింది ఒకసారి మణి. ఆమెకి కావలసిన మార్పు అతనిలో రావటమే ఆమె కోరింది. అది ఫలించిందిగా!

కాలగర్భంలో మూడేళ్ళు గడిచి పోయాయి. రెండవ సారి అబ్బాయిని ఎత్తుకుందుకు వచ్చిన శారద, పెండ్లికూతుర్ని చూసుకోవటానికి వచ్చిన మధు, కోరిన వరుని వదిన ప్రయత్నంమీద వివాహం చేసుకోబోతూన్న పాప ఇంట్లో ఉండగా, డాక్టరయి

(తరువాయి 61 వ పేజీలో)



ఆ రోజె డిగ్రీ పుచ్చుకు వచ్చిన సారథి మణికి నమస్కరించాడు.

"వదినా! ఇది మూడేండ్ల క్రిందట రావలసిన డిగ్రీ. ఈనాటికన్నా నీ దయవలన తెచ్చుకో గలిగాను. నీ ఋణం త్వరలోనే తీర్చేస్తాను వదినా! నీ మేలు మరువలేను." అంటూన్న అతని వైపు ఆశ్చర్యంగా చూశారంతా. మణి విందుగా నవ్వింది.

'సారథీ! నా కోరిక ఫలించింది. మీ అందరి


ఏజంట్లు కావలెను

"ఎస్కార్ట్" 3బాండ్ల, అఖిలప్రపంచ పోర్టబుల్ ట్రాన్సిస్టర్‌కు ఆర్డర్లు బుక్ చేయుటకు 30% కమిషన్ మీద ఏజంట్లు కావలెను. ఇవితసరతు లకు, శాంపిల్ ట్రాన్సిస్టర్‌కు వ్రాయండి:—



JAPCO (A.P.W.V.-27)
P.O. Box 1382, Delhi-6.


# మాతృభక్తుడి దేవత

(11 వ పేజీ తరువాయి)

శ్రేయస్సు మీ అమ్మలానే, అన్నయ్యలానే నేనుకూడా కోరాను. కాని . . . బాధ్యతారహితప్రవర్తన నేను సహించలేను. అందుకే మిమ్మల్ని అధికారంతో శాసించాను. దాని ఫలితంగా ఈనాడు మీ అందరి అభివృద్ధి చూసి సంతోషించ గలుగుతున్నాను. శత్రుత్వంతోనైనా మంచిని సాధించాలనే నా ఆశయం నెరవేరింది. పోతే . . . సారథీ! నిన్ను మార్చటానికి మాత్రమే నీకు అప్పు ఇస్తున్నట్లు రాయించుకున్నాను తప్ప నీ దగ్గిర తిరిగి డబ్బు పుచ్చుకోవాలన్నది నా ఉద్దేశం కాదు. నీకు డిగ్రీ వచ్చిన క్షణంలోనే నీవు తీర్చవలసిన అప్పు తీరిపోయింది. ఇదిగో కాగితాలు. నావల్ల మీ అందరికీ కొంత బాధ కలిగి ఉండవచ్చు. క్షమించండి." అంటూ సారథి రాసి ఇచ్చిన ఋణపత్రాలు చింపి పారేసిన మణివైపు సారథితో సహా అందరూ వింతగా చూశారు. మణి తన పెట్టెలో నుంచి రెండు కాగితాలు చింపి రామారావు చేతిలో పెట్టింది.

"ఊహూ. . . నేను సహించను. ఈ మాతృభక్తులు తన తల్లి చెప్పిన ప్రతిదానికి తల ఊపుతూంటే బాధ్యత లేనట్లు మిగిలిన వాళ్లంతా ప్రవర్తిస్తూంటే నేను సహించను. సహించలేను."

"నేను కోడల్ని కాదు. వదినని . . . కానియ్యి . . . మొగుణ్ణి వలలో వేసుకున్నాను. అందరికీ దూరం చేస్తున్నాను. కానియ్యి . . . ఎలాగూ మాటల్ని పడ్డాను. ఇంక . . . ఈ సమస్యలకి పరిష్కారం వెతుకుతాను. తల ఊపటం కాదు. అడ్డంగా తిప్పి ఈ పరిస్థితుల్ని మార్చి, బాధ్యతల్ని వీళ్లందరికి గుర్తింప జేస్తాను. భగవాన్! అందుకు తగిన మనోబలాన్ని ఇయ్యి. కాని. . . కాని. . . కాని. . ఈ మాతృభక్తుని లో ఏ చిన్ని విషపుబొట్టును చిందనివ్వను. అన్నిటికీ నా వ్యక్తిత్వపు విలవనే ధారపోస్తాను. భగవాన్! ఆయనకి అన్యాయం చేయకుందును గాక!"

ఆ రెండు కాగితాలు క్రమంగా చేతులు మారాయి.

"వదినా! నీవు మాతృభక్తుడి భార్యవన్నమాట!" సాప నవ్వుతూ అంది. దానికి రామారావు సమాధానం:

"కాదు. మాతృభక్తుడి దేవత!"

మహాలక్ష్మమ్మ కోడల్ని ఆప్యాయంగా దగ్గిరికి తీసుకుంది. మణి హాయిగా, తృప్తిగా నిట్టూర్చింది. ఆమె ప్రయత్నం ఈనాటికి ఫలించింది. ★


టాటావారి షాంపూ వలన మీ జుట్టులో కలుగు వ్యత్యాసం గమనించండి

స్వచ్ఛమైన కొబ్బరి నూనెతో తయారుచేయ బడిన టాటా వారి షాంపూతో మీ జుట్టుకు తగిన ప్రత్యేక పోషణ లభిస్తుంది. దీని సమృద్ధమైన నురుగు మీ జుట్టును శుభ్రపరచి మెరుగుపెడుతుంది...పట్టు వంటి మెత్తదనం. సుగంధించే పరిమళం మీ జుట్టుకు కల్పించి, సునాయాసంగా మీరు కోరిన పద్ధతిలో కేశాలంకరణ చేసు కొనుటకు తోడ్పడుతుంది గుర్తుంచుకోండి, శుభ్రమైన అందమైన జుట్టు కోసం టాటా వారి షాంపూ తేలిక మార్గం!

మీ కుటుంబం అంతకూ సరిపోయే పెద్ద సైజు ఎకానమీ సీసా కొనండి.

ప్రత్యేక సదుపాయం: సాంప్రదాయకమైన మరియు ఆధునికమైన కేశశృంగారమును గూర్చిన సచిత్ర పుస్తకం ఉచితంగా పొందుటకు, 50 పైసల స్టాంపులతో ఈ కూపను జతపరచి టాటా ఆయిల్ మిల్స్ కంపెనీ లిమిటెడ్, బొంబే హౌస్, బ్రూస్ స్ట్రీట్, బొంబాయి-1 చిరునామాకు పంపండి. 31




టాటావారి షాంపూ — భారతదేశంలో, సర్వాధిక అమ్మకంగల షాంపూ!